జర్నలిస్ట్ వార్త
మంగళవారం
9 జనవరి 2024



# కేసీఆర్ పాలనలో ఆర్టీసీ కార్మికులకు దగపడ్డారు.

## - విలీన ప్రక్రియ పూర్తి చేయాలని గొలనకొండ వేణు విజ్ఞప్తి

నర్సంపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ కార్మికులు దగాపడ్డారని సోమవారం నర్సంపేట డిపో సెక్రటరీ గొలనకొండ వేణు అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ కార్మికులకు విముక్తి కల్పిస్తారని వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఇట్టి విషయమై సుందరయ్య విజ్ఞాన్ భవన్, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ లో టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సెంట్రల్ కమిటీ సమావేశంలో వేణు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఒక్క రూపాయి జీతం పెంచకుండా ఆర్టీసీ ఉద్యోగులను అప్పుల పాలు, అభాసు పాలు చేసిందన్నారు. విలీన ప్రక్రియ పూర్తి చేయకుండా మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు. కోరుకున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలోకి వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ ప్రభుత్వ విలీన ప్రక్రియ పూర్తి చేసే సర్క్యులర్ ను వెంటనే విడుదల చేసి, సంక్రాంతి పండుగకు ఆర్టీసీ కుటుంబాలలో సంతోషం నింపాలని వేణు అన్నారు

ప్రభుత్వ విలీనానికి సంబంధించి గత ప్రభుత్వం జులై 31న కేబినెట్ తీర్మానం, ఆగష్టు 6న అసెంబ్లీలో విలీన బిల్లు పాస్, న్యాయనిపుణుల సలహాలతో గవర్నర్ తమిళిసై ఆమోదముద్ర, సెప్టెంబర్ 15న గెజిట్ విడుదల చేసిందన్నారు. మిగిలిన ఒకే ఒక్క విలీన ప్రక్రియ గవర్నమెంట్ జీవో విడుదల చేస్తే, విలీన ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. విలీనం చేస్తారని 43 వేల మంది కార్మికులు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నరని ఆయన పేర్కొన్నారు. 2023 జులై మాసం నుండి ప్రతీ నెల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు విలీన ప్రక్రియ ఫలాలు పొందాలని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నరన్నారు. విలీన ప్రక్రియ పూర్తి కాకుండ నిరాశతో రిటైర్ మెంట్ పొందుతున్నారని తెలిపారు. కావున విలీన ప్రక్రియ పూర్తి చేసే అపాయింట్ డేట్ ను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. త్వరలో రానున్న లోక్ సభ ఎన్నికల కోడ్ విడుదల చేయకముందే ఆర్టీసీ ఉద్యోగులకు రావలసిన, మిగిలిన 2 పీఆర్సీలు, పెండింగ్ బకాయిలు అమలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగులు జీవితాంతం ఋణపడి ఉంటారని విజ్ఞప్తి చేశారు.

## కోటగుళ్ళ గోవులకు దానా బస్తాల పంపిణీ



గణపురం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోవులకు సోమవారం మండల కేంద్రానికి చెందిన శ్రీపతి మంజుల రాజు, ముప్పిడొజు శిరీష, శరత్ దంపతులు దానా బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేష్ వారికి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాలకు దాన బస్తాలను అందజేసిన దంపతులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.?

## మేడారం జాతర సమీపిస్తోంది

### - ఇసుక లారీలు నియంత్రించాలని మంత్రి సీతక్క ఆదేశం



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సమీపం సమీపిస్తోంది. సోమవారం ఇసుక లారీ ను నియంత్రించాలని తెలంగాణ పంచాయితీ రాజ్ శాఖ మంత్రి వర్యులు అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో జాతరకు హాజరయ్యే పరిస్థితి తెలిసిందే. భక్తుల రాకపోకల మధ్య ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల నిర్మాణ పనులు చేపట్టిన సమయంలో ఇసుక లారీలు తిరగడం ప్రమాదకరమని సూచించారు. నిర్మాణం చేస్తున్న రోడ్లపై అధిక బరువుతో లారీలు తిరిగితే గుంతలు ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. భక్తి శ్రద్ధలతో జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవార్లను దర్శించుకుని, సురక్షితంగా ఇళ్లల్లోకి చేరుకునేలా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మేడారం సందర్శించే భక్తుల సౌకర్యాల భాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. రహదారులపైకి ఓవర్ లోడు వాహనాలు వస్తే అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. ఆదేశాలు అతిక్రమించి ఓవర్ లోడు వాహనాలు ప్రయాణిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసిద్దిగాంచిన దేవాలయాల్లో ఒకటైన సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లలో ఎవ్వరూ అలసత్వం వహించినా సహించేది లేదన్నారు. జాతర సందర్భంగా జారీ ఆదేశాలు అతిక్రమిస్తే అధికారులు ఇంటికి, కాంట్రాక్టర్లు బ్లాక్ లిస్ట్ లోకి వెళ్ళడం ఖాయమని మంత్రి వర్యులు హెచ్చరించారు.

## ఐనవోలు ఎస్సై భాద్యతలు చేపట్టిన అనిల్ కుమార్




ఐనవోలు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐనవోలు ఎస్సై నవీన్ కుమార్ పై సోమవారం సస్పెన్షన్ వేటు పడ్డ సంగతి తెలిసిందే. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల ప్రకారం నవీన్ కుమార్ ని బదిలీ చేస్తూ, వీఆర్ నుంచి జీ. అనిల్ కుమార్ కు ఎస్సై భాద్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ భాద్యతలు చేపట్టారు.

## ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

### - కర్రుకాల్చి వాతపెట్టిన నియోజకవర్గ ప్రజలు
### - మీడియా సమావేశంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి



నర్సంపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు నిధులు తెచ్చానంటూ జీవోలు చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆరోపించారు. ప్రైవేట్ ఏజెన్సీ వాళ్ళు స్వచ్ఛందంగా పేద ప్రజలకు కుట్టు మిషన్లు బహుకరిస్తుంటే, మాజీ ఎమ్మెల్యే గత ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వ్యూహరచన చేశారు. ఈ తతంగం గమనించిన నియోజకవర్గ ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని పేర్కొన్నారు. ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండా అంతర్గతంగా దరఖాస్తు తీసుకొని దళిత బంధు ఇస్తామంటూ, ఒక్క యూనిట్ ఐదుగురు పంచుకోవాలంటూ, అగ్రిమెంట్లు రాయించి దళితులను మోసం చేశారని అన్నారు. మోసం చేసింది చాలదంటూ దళిత బంధు సాంక్షన్ అయ్యిందని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క పేద కుటుంబానికి సొంత ఇల్లు, 100 గజాల స్థలం ఇప్పించలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామంటూ ఎన్నికల ముందు పేద ప్రజలతో పునాదులు వేయించి, కనీసం వారికి లబ్ధిదారుల పత్రాలను సైతం చూపించని దౌర్భాగ్యుడు మాజీ ఎమ్మెల్యే అన్నారు. రైతు పనిముట్లకు సంబంధించి ఐదు ఏళ్ళుగా గుర్తుకురాని రైతులు ఎన్నికల నోటిఫికేషన్ కు ఒక నెల రోజుల ముందు చూపించడం, ఐటెం రాజకీయాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని సూచించారు. మరోమారు మీడియా సమావేశాలు పెట్టి తనను ఉద్దేశించి మాట్లాడితే ప్రజల చేతిలో మరోమారు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న వారు గాబరా పడాల్సిన అవసరం లేదన్నారు. నిష్పక్షపాతంగా పరిపాలన కొనసాగించే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, మహిళ నాయకులు, యువజన కాంగ్రెస్, నాయకులు, ఎన్.ఎస్.యు,ఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏనుమాముల మార్కెట్ ఎదుట మిర్చి రైతుల ధర్నా

### - మద్దతు ధర కల్పించాలని డిమాండ్



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి సోమవారం మిర్చి రైతులు ధర్నాకు దిగారు. దీంతో రహదారికి ఇరువైపులా కొంత సమయం పాటు వాహనదారులకు రాకపోకల మధ్య అంతరాయం ఏర్పడింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సరైన మద్దతు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతన్నలు మాట్లాడుతూ సంబంధిత అధికారులు సిండికేట్ గా మారి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిజానికి తేజా మిర్చి మార్కెట్లో క్వింటాకు 21 వెయ్యి మద్దతు ధర పలుకుతుందన్నారు. వ్యవసాయ మార్కెట్ సంప్రదించిన రైతులను ఇదే అదునుగా తీసుకున్న వారు క్వింటాకు 13 వేల రూపాయల ధరను కల్పిస్తూ, పక్కాగా పథకం ప్రకారం మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుమాముల మార్కెట్ లో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం దృష్టిపెట్టి రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తూ, సిండికేట్ గా మారిన అధికారులపై చర్యలు చేపట్టి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భూమి పూజ

### - పాల్గొన్న దొమ్మటి సాంబయ్య



పాలకుర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో సోమవారం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధ్యక్షతన, పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు వరంగల్ పార్లమెంట్ కాంటెస్టెడ్ దొమ్మటి సాంబయ్య హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని హనుమండ్ల జాన్సీ రాజేందర్ రెడ్డి వారి సొంత స్థలం లో 75 ఎకరాలలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు, యువకులకు మంచి అవకాశమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణం పూర్తయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయన్నారు. గత 10 సంవత్సరాలు ఒక రాక్షస పాలనలో మగ్గిపోయిన పాలకుర్తి ప్రజలకు విముక్తి కలిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు, యశస్విని రెడ్డి గెలుపుకు కృషి చేసిన పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, వివిధ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకలిని తీర్చేందుకే అన్నదానం

### - కొత్తగూడా సర్పంచ్ ఆత్రం రాహుల్



ఉట్నూర్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటిడిఏ కార్యాలయ ఆవరణంలో సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తగూడా గ్రామ సర్పంచ్ ఆత్రం రాహుల్ తెలిపిన వివరాల మేరకు ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం చేపడతున్నమన్నారు. ఐటీడీఏ కార్యాలయానికి గ్రీవెన్స్ లో భాగంగా ప్రతి సోమవారం హాజరయ్యే దూర ప్రాంతాల ప్రజలకు భోజనం పెట్టాలని ఈ కార్యక్రమానికి శ్రీకరం చుట్టారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చేవారు ఆకలితో అలమటించే పరిస్థితి వారికి ఏర్పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతి సోమవారం దాదాపు 500 మందికి పైగా భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ సర్పంచ్ భీమన్న, మాజీ మండల అధ్యక్షులు దుటా రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, నాయకులు మహేందర్, మెస్రం నగేష్, అక్షయ్ పటేల్, మహిళలు బొజ్జన్న సైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య శ్రీరాముల వారి అక్షింతల వితరణ

### - పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్



వరంగల్ కాశీబుగ్గ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: సుందరయ్య నగర్, ఎస్.ఆర్ నగర్, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కొత్తకొండ రాజు ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతల వితరణ కాశీబుగ్గ శ్రీ రంగనాథ ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ హాజరై అక్షింతలు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో మంతెన అపర్ణ, మంతెన శ్రీనివాస్, రాజు, కిషన్, పస్తం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం
9 జనవరి 2024
జర్నలిస్ట్ వార్త

# 24 గంటల్లో 600కు పైనే కొత్త కేసులు.. నాలుగు మరణాలు



భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. తాజాగా 24 గంటల వ్యవధిలో 605 కొత్త కేసులు బయటపడినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశంలో వైరస్ బారిన పడిన వారి సంఖ్య 4,50,18,792కి చేరింది.ప్రస్తుతం దేశంలో 4,002 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల వ్యవధిలో 648 మంది కోలుకున్నారు. దీంతో మహమ్మారి నుంచి ఇప్పటి వరకూ కోలుకున్న వారి సంఖ్య 44,481,341కి పెరిగింది. నిన్న ఒక్కరోజే నాలుగు మరణాలు నమోదయ్యాయి. కేరళలో ఇద్దరు, కర్ణాటక, త్రిపురలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. దీంతో దేశంలో కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,396కి చేరింది.ప్రస్తుతం దేశంలో 0.01 శాతం మాత్రమే యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రికవరీ రేటు 98.81 శాతం కాగా, మరణాల రేటు 1.18 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఇక ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా 220.67 కోట్ల (220,67,81,656) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది.

## కాల్వలోకి దూసుకెళ్లిన 108 వాహనం



అమృతలూరు,) అమృతలూరు మండలం పెదపూడి వంతెన మలుపు వద్ద నేటి తెల్లవారు ఝామున 108 వాహనం నిజాంఎ్టన్నం కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో వాహనంలోని వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలలోకి వెళితే నిజాంపట్నం మండలం గోకర్ణమఠం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి, మరో ముగ్గురు సహాయకులతో 108 వాహనం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు ప్రయాణిస్తోంది.

వేకువన మంచు ఎక్కువగా ఉండడంతో పెదపూడి వంతెన మలుపులో చోదకుడికి మార్గం కనిపించలేదు. దీంతో అదుపుతప్పి కాల్వలోకి వాహనం దూసుకెళ్లింది. డ్రైవర్ అంకమ్మరావు ఈ విషయాన్ని అమృతలూరు 108 వాహన సిబ్బందికి తెలిపారు. వెంటనే అమృతలూరుకు చెందిన 108 వాహనం ద్వారా బాధితులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ సాయంతో కాలువ నుంచి వాహనాన్ని బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం హాస్పటల్ కు తరలించారు.

## నీట్-పీజీ పరీక్షలు జూలై మొదటి వారంలో ఈసారి నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ ఉండదు




న్యూఢిల్లీ,: నీట్-పీజీ పరీక్షలు జులై మొదటి వారంలో నిర్వహించే అవకాశం ఉందని శనివారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) నిర్వహించే అవకాశం లేదని వెల్లడించాయి. పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ (అమెండ్‌మెంట్) రెగ్యులేషన్స్-2018 బదులు పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ రెగ్యులేషన్స్-2023ను ఇటీవల ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నెక్ట్స్ విధానం అమల్లోకి వచ్చే వరకు ప్రస్తుతమున్న నీట్-పీజీ పరీక్షలు కొనసాగుతాయి.

## డయాబెటిస్ 1.5.. ఎందుకు పెరుగుతుంది

ఫీచర్స్ : డయాబెటిస్ రకాల్లో టైమ్ 1, టైప్ 2 గురించి అందరికీ తెలిసిందే. కానీ ఈ మధ్య మరో కొత్తరకం మధుమేహం బాధితులు కూడా పెరుగుతున్నారు. ఇది ఇతర అనారోగ్యాలకు కారణం అవుతోంది. అయితే చాలామంది బాధితులకు తాము 1.5 డయాబెటీస్ బారిన పడినట్లు త్వరగా గుర్తించలేకపోతున్నారట. శరీరంలో ప్యాంక్రియాస్ ఇన్సులినన్ను తయారు చేసే కణాలపై ప్రతిరోధకాలు (యాంటీబాడీస్) దాడిచేసినప్పుడు ఈ వ్యాధి వస్తుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. అయితే ఇది అరుదుగా వస్తుంది. 30 ఏండ్లు పైబడిన వారిలోనూ రావచ్చు.టైప్ 1.5 బాధితులు సాధారణం కంటే ఎక్కువసార్లు యూరిన్కు వెళ్లడం (పాలియూరియా), అధిక దాహం (పాలిడిప్సియా), రాత్రిళ్లు తరచుగా మూత్ర విసర్జనకోసం లేవాల్సి రావడం (నోక్టురియా), తరచూ అలసట, కంటిచూపు లోపాలు, కాళ్లల్లో జలదరింపు వంటి ప్రాబ్లమ్స్ ఫేస్ చేస్తుంటారు. అలాగే బరువు తగ్గడం కూడా టైప్ 1.5 మధుమేహం లక్షణాల్లో ఒకటి. దాదాపు ఇది టైప్ 1 డయాబెటిస్ మాదిరిగానే ఉన్నప్పటికీ, అంత రిస్కును కలిగించేది అయితే కాదు. పైగా సింప్టమ్స్, ప్రభావం కూడా వెంటనే కనిపించవు. పౌష్టికాహారం తీసుకోవడం, రోజూ వ్యాయామాలు, లేదా ఇతర ఫిజికల్ యాక్టివిటీస్ ఉండేలా చూసుకోవడం, హెల్తీ లైఫ్ స్టైల వల్ల దీనిని నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే లక్షణాలు అధికమైనప్పుడు మాత్రం ఇన్సులిన్ ప్రక్రియ అవసరం అవుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ వ్యాధిని గుర్తించడానికి బ్లడ్లో షుగర్ లెవల్స్ను టెస్టు చేయించుకోవాలి. అలాగే లిపిడ్ ప్రొఫైల్, అల్బుమిన్, పెరిఫెరల్ న్యూరోపతి, రెటినోపతి వంటి టెస్టులు అవసరం అవుతాయని నిపుణులు చెప్తున్నారు.

# పేదలకు వైద్యం

### అందించేందుకు కృషి డాక్టర్ సాయి రెడ్డి



మెదక్,: పేదలకు వైద్యం అందించేందుకు కృషి చేస్తానని డాక్టర్ సాయి రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలో ఉచిత పల్మనాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి భారీగా వచ్చిన రోగులకు వైద్యం అందించి, ఊపిరితిత్తులకు గల పీఎఫ్టీ టెస్టును ఉచితంగా యశోద ఆసుపత్రి వైద్యులు, పల్మనాలజీ ఎం. డాక్టర్ సాయి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను పేదల కోసం వైద్య సేవలను ఇలా వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా 'మెదక్ ప్రజలకు సేవలు అందిస్తున్నానని, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేయడం తనకు ఇష్టమని, కరోనా సమయంలో కూడా మెదక్ ప్రజలకు నిరంతరంగా సేవలు అందించడం అదృష్టమన్నారు. ఊపిరితిత్తుల సంబంధిత ఎలాంటి సమస్యనైన నయం చేయడానికి తాను ప్రతి క్షణం సిద్ధంగా ఉంటానని తెలిపారు.

తన సేవలు ప్రతిరోజు యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ వద్ద ప్రతి నెల మొదటి ఆదివారం మెదక్లో గల మహెతాబ్ మెడికల్ పాలీ క్లినిక్ వద్ద అందుబాటులో ఉంటానని తెలిపారు.మహతాబ్ మెడికల్ యజమాని జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ... ఇలాంటి వైద్య శిబిరాలు గత పది సంవత్సరాల నుంచి ఎన్నో చేశామని, మెదక్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కూడా ఇలాంటి వైద్య శిబిరాలు. నిర్వహించామని, ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సమాజంలో ముందుకు వస్తున్నామనీ తెలిపారు. మెదక్ పట్టణంలో నిరంతరం ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా సేవలను అందిస్తూనే ఉంటానని తెలిపారు.

## గుండెపోటుతో కేయూ ఉద్యోగి మృతి

**- 20 లక్షల బకాయిలపై ఆందోళన**

హనుమకొండ, గుండెపోటుతో కేయూ ఉద్యోగి మృతి చెందాడు. కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు చేసిన పనికి బిల్లులు చెల్లించకపోవడంతో మానసికంగా మనోవేదనకు గురై మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. కేయూ హిస్టరీ, టూరిజం విభాగంలో లమ్సమ్ ఉద్యోగిగా పనిచేస్తున్న కాలె మధుసూదన్ (49) వర్సిటీ ఐడీ కార్డులు,
ఫ్లెక్సీలు, నేమ్‌ప్లేట్స్, బోర్డులు, ప్రింటింగ్‌కు సంబంధించిన రామెటీరియల్స్ తీసుకువచ్చి ఇంటి వద్ద పనిచేస్తుంటాడు.గతంలో న్యాక్ బృందం పర్యటన సందర్భంగా న్యాక్ పర్చేజింగ్ కమిటీ చైర్మన్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మంచాల సదానందం రూ.20 లక్షల విలువైన పనులు చేయించారు. ఆ బిల్లులు చెల్లించలేదు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయింది. దీంతో ఒత్తిడికి గురై ఆదివారం గుండెనొప్పితో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపా రు. మృతదేహాన్ని కేయూ పరిపాలనా భవనం ఎదుట ఉంచి నిరసన తెలిపారు. సోమవారంలోగా డబ్బులు చెల్లిస్తామని వీసీ రమేశ్ హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకెళ్లారు.

## హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలి

హిందూపురం , సచివాలయ హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరిమళ డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ జేఏసీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ హెల్త్ సెక్రెటరీల సంఘం, సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయం రెండు శాఖలు మాపై అజమాయిషీ చెలాయిస్తున్నాయని మండిపడ్డారు.
అలా కాకుండా ఒక్క శాఖ మాత్రమే అజమాయిషీ చేయలన్నారు. 42 యాప్‌లు ఉన్నాయని వాటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆ యాప్‌లను కుదించాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రెటరీలకు ప్రత్యేక గుర్తింపు కోసం ఐడీ కార్డులు, యూనిఫాం అందించాలన్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు రామాంజినమ్మ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, అధ్యక్షురాలు అంజినమ్మ, కార్యదర్శి మాధవి, గౌసియా, సరిత, యశోదరాణి, ఏఐటీయూసీ తాలుకా సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, బాలస్వామి పాల్గొన్నారు.%ఖ

# విధుల్లో అలసత్వం వహించిన ఎస్సై సస్పెన్షన్

**- ఉత్తర్వులు జారీ చేసిన పోలీస్ కమిషనర్**

ఐనవోలు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐనవోలు ఎస్సై నవీన్ కుమార్ విధుల్లో అలసత్వం వహించారని సోమవారం వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. గంజాయి కేసులో ఎన్.డి.పి.ఎస్ గైడ్ లైన్స్ అనుసరించి దర్యాప్తు చేపట్టకుండా విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం వీఆర్‌లో వున్న జి. అనిల్ కుమార్ ని ఐనవోలు నూతన ఎస్ఐగా నియమిస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలీస్ కమిషనర్ ని కలిసిన ట్రైనీ ఐపిఎస్ అధికారి



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐపీఎస్
శిక్షణ నిమిత్తం ట్రైనీ ఐపిఎస్ అధికారి శుభం నాగ్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసారు. 6 నెలల కాలం వివిధ హెూదాల్లో పోలీస్ విభాగంలో పని చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు నియమితులైనారు. ట్రైనీ ఐపిఎస్ శుభంనాగ్ మహరాష్ట్రకు చెందిన కాగా ఐ.ఐ.టిలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించాలనే లక్ష్యంతో 2022 సంవత్సరంలో ఐపిఎస్ భాద్యతలకు ఎంపికయ్యారు. ఈ సందర్బంగా ప్రస్తుత వరంగల్ కమిషనరేట్ పోలీసుల తీరుతో పాటు వరంగల్ ప్రస్తుత స్థితిగతులపై పోలీస్ కమిషనర్ ట్రైనీ ఐపిఎస్ అధికారికి వివరించారు.

## ప్రతీ ఎకరాన్ని సాగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

**- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**



రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం మైలారం గ్రామంలోని రిజర్వాయర్ ను సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాన్ల యశస్విని రెడ్డి సందర్శించారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఎకరాన్ని సాగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల అభివృద్ధియే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం క్వింటాకు 500 రూపాయల బోనస్ తో రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోతు హమ్యా నాయక్ , ఎల్లారెడ్డి, ఈదుగంటి రవీందర్ రెడ్డి, తుమ్మ భూపాల్ రెడ్డి, ఈదుగంటి మహిపాల్ రెడ్డి, చిర్ర మల్లయ్య, బోయిని కుమార్, పి రవీందర్ రెడ్డి, గాడిపెల్లి పెంటయ్య, గాడిపెల్లి యాకయ్య, బోయిని కొమరయ్య, పి యకుబ్ రెడ్డి, ఎనగందుల మురళి, మహిపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గబేట బాబు తదితరులు పాల్గొన్నారు.

## 8 నుంచి 12 ఏండ్లలోపు వయస్సుగల ప్రతి ముగ్గురిలో ఒకరు. మెంటల్ స్ట్రెస్,

పిల్లలు ఎప్పుడూ హ్యాపీగా ఉంటారనే అందరం అనుకుంటాం. కానీ ఉరుకుల పరుగుల జీవితం, చిన్నఏజ్లోనే చదువుల భారం, పెద్దలు అర్థం చేసుకోలేకపోవడం వంటి కారణాలతో వారు కూడా ఆందోళన చెందుతారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. 8 నుంచి 12 ఏండ్లలోపు వయస్సుగల ప్రతి ముగ్గురిలో ఒకరు. మెంటల్ స్ట్రెస్, యాంగ్జైటీస్లను ఎదుర్కొంటున్నట్లు 'వాట్ వర్రీయింగ్ ఇన్ కిడ్స్' పేరుతో నిర్వహించిన ఒక రీసెంట్ స్టడీలో వెల్లడైంది. ఇది వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెప్తున్నారు. పైగా స్కూల్ స్థాయిలోనే చాలా మంది పిల్లలు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇందులో తోటి స్నేహితుల దురుసు ప్రవర్తనవల్ల 41% పిల్లలు ఒత్తిడికి గురవుతుడగా 35 శాతం మంది తాము ఎంతో ఇష్టపడే పేరెంట్స్, ఫ్రెండ్స్ ఆరోగ్యం గురించి, అలాగే పేరెంట్స్తో ఎక్కువసేపు గడపలేకపోతున్నామని ఆందోళన చెందుతున్నారు.స్కూల్ స్థాయిలోనే 65 శాతం మంది పిల్లలు తమ లుక్స్, బాడీ ఇమేజింగ్ విషయంలో వర్రీ అవుతున్నారట. అధ్యయనం ప్రకారం.. 55 శాతం మంది బెదిరింపులవల్ల ఆందోళన చెందుతున్నారు. 46 శాతం మంది వారానికి ఒకటికంటే ఎక్కువసార్లు తమ ఫ్రెండ్స్ వల్ల ఒత్తిడికి గురవుతున్నారు. ఇక 21 శాతం మంది పిల్లలు వీక్లీవన్స్ డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరో 20 శాతం మంది పిల్లలు హింసాత్మక సంఘటనలు, వీడియోలు చూసినప్పుడు, వార్తలు విన్నప్పుడు ఆందోళన చెందుతుండగా, 19 శాతం మంది పర్యావరణం వంటి అంశాల కారణంగా స్ట్రెస్కు గురవుతున్నారు.

